మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

పార్థివదేహాలకు నివాళులర్పిస్తూ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి

వనపర్తి టౌన్, మే 5: జిల్లా కేంద్రం లోని 32వ వార్డుకు చెందిన డాక్టర్ రవికుమార్ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం బాధితుల ఇంటికెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా 28వ వార్డుకు చెందిన రిటైర్డ్ మున్సిపల్ మేనేజర్ మృతిచెందిన విషయాన్ని తెలుసు కొని పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్లు నాగన్నయాదవ్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, గులాం ఖాదర్, రవిప్రకాశ్‌రెడ్డి, చిట్యాల రాము, వజ్రాల రమేశ్ తదితరులు ఉన్నారు.

'భూ భారతి'తో శాశ్వత పరిష్కారం

- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

జయన్నతిరుమలాపురంలో భూ భారతిపై మాట్లాడుతున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట, మే 5 : ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. మండలంలోని జయన్నతిరుమలాపురంలో సోమవారం నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూ భారతి చట్టంలో తాసీల్దార్ తప్పుచేస్తే ఆర్డీవోకు, ఆర్డీవో తప్పు చేస్తే కలెక్టర్ అక్కడ కూడా న్యాయం జరుగకుంటే సీసీఎల్ఏ లేదా ట్రిబ్యునల్ లో ఫిర్యాదు చేసుకునే అవకాశం భూ భారతిలో కల్పించారని వివరించారు. భూమి రిజిస్ట్రేషన్ చేయిస్తే ముందుగా సర్వే చేయించి భూమి పట్టాను పాస్ పుస్తకంలో ముద్రించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీటీ తిలక్‌కుమార్ రెడ్డి మండల ప్రత్యేకాధికారి రాజు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, మే 5 : ప్రభుత్వం రైతు కుటుంబాలకు అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గట్టు మండలంలోని రాయపురం గ్రామానికి చెందిన రైతు కురువ మల్లమ్మ మృతిచెందడంతో ఆమె భర్త జమ్మన్నకు ప్రభుత్వం తరపున మంజూరైన రైతు బీమా చెక్కు రూ.5లక్షలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, రామకృష్ణనాయుడు, మురళి, కుర్మన్న, గోవిందు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో 500మార్కులకు పైగా 13మంది విద్యార్థులు మార్కులు సాధించడంతో వారిని ఎమ్మెల్యే సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. పాఠశాలకు చెందిన శివ శంకర్ 600మార్కులకు గానూ 555మార్కులు సాధించడంపై ఎమ్మెల్యే శివశంకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటనర్సయ్య, ఉపాధ్యాయులు విష్ణు, యువతి, సవారన్న, నర్సింహులు, సునీత బాలు, శివప్రియ, మహేందర్, ప్రశాంత్, మధు, మహేశ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ నేతల వినతి

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అమరచింత, మే 5 : పట్టణంలోని అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, ప్రధాన కార్యదర్శి చిన్న బాల్‌రాజు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వారు మున్సిపల్ కమిషనర్ రవిబాబుతో కలిసి మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఒకరిద్దరు అర్హులు తప్పా మిగిలిన వారందరికీ అధికార పార్టీ నాయకులు సూచించిన వారినే ఎంపిక చేసినట్లుగా తమకు సమాచారం ఉందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. అలాగే పట్టణంలోని పలు వార్డుల్లో సమస్యలు ఎక్కడికక్కడ పెరుకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని త్వరగా పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అబ్రహం, కోరి శ్రీనివాసులు, జాన్సన్, క్రాంతి, పెద్ద బాలరాజు, శంషిర్, శేఖర్, అల్లి, రమేశ్, విజయ్ ఉన్నారు.

వేసవిలో విద్యార్థులకు యంగ్ ఇండియా శిబిరాలు

- జిల్లా మానిటరింగ్ అధికారి మహానంది

శిబిరాన్ని పరిశీలిస్తున్న మానిటరింగ్ అధికారి

పెబ్బేరు, మే 5 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వేసవిలో ఇస్తున్న యంగ్ ఇండియా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహానంది అన్నారు. సోమవారం ఆయన పెబ్బేరు మండలం యాపర్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల వేసవి శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ విద్యా శాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలో 50 పాఠశాలల్లో యంగ్ ఇండియా శిక్షణ శిబిరాలు ఏర్పాటు యయ్యాయన్నారు. నలభై రోజులపాటు ప్రాథమిక, ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఇంగ్లిష్, గణితంలో బేసిక్స్, ఇతర సబ్జెక్టులతోపాటు ఆట విడుపుగా చెస్, క్యారమ్స్, టెన్నీస్, గ్రామీణ ఆటల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. యాపర్ల పాఠశాలలో 90మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శంకర్ గౌడ్, గ్రామస్తులు నరేందర్ రెడ్డి, స్వరాజ్యం, బాబురెడ్డి పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సంతోష్
- గోపాల్‌దిన్నెలో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం

ఇటిక్యాల, మే 5 : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. భూభారతి చట్టం అమలుకు గానూ జిల్లాలో ఇటిక్యాల మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రకటించి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారు. పైలట్ ప్రాజెక్ట్ అమలులో భాగంగా సోమవారం మండలంలోని గోపాల్‌దిన్నెలో నిర్వహించిన రెవెన్యూసదస్సుకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులే ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. రుసుముతో మీసేవలో దరఖాస్తు చేసుకొంటే పరిష్కారమయ్యే రెవెన్యూసమస్యలు ఎలాంటి ఫీజు లేకుండా రైతుల చెంతనే పరిష్కరిస్తారని తెలిపారు. సదస్సులో స్వీకరణకు వచ్చిన సమస్యలను నెలరోజుల్లో పరిష్కరించి ప్రొసీడింగ్ ఇస్తారని తెలిపారు. అనంతరం ఆయన గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. కార్యక్రమంలో తాసీల్దార్లు భద్రప్ప, నరేశ్, ఎంపీడీవో అజర్‌మొయుద్దీన్, డీటీ వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు మనోహర్, నరేశ్, హౌసింగ్ పీడీ ఖాసీనా ఢాయక్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు

గద్వాల, మే 5 : వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంతోష్ మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో తాగునీటి అంశంపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే నెల రోజులు చాల కీలకమని అధికారులు అందరూ అప్రమత్తంగా ఉంటూ తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రతి ఇంటికి తాగునీరు అందించే విధంగా కార్యచరణ రూపొందించాలని ఆదేశించారు. అవసర మైన వాటర్ సప్లయ్, ఓహెచ్‌ఆర్‌సీ ట్యాంకులు, ప్రైవేట్‌బోర్లు, చేతిపంపులు, ట్యాంకర్లను మరమ్మతులు చేయించి పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే పనులు చేపట్టాలన్నారు.గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి కొరత కనిపిస్తే వెంటనే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని డీపీవోకు ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా మిషన్ భగీరథ అధికారులు డీపీవో,ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేసి తాగునీటి సమస్యను అధిగమించాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు వెంకటరమణ, పరమేశ్వరి, శ్రీధర్ డ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలకు తూట్లు

గద్వాల, మే 5 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలకు తూట్లు పొడుస్తూ రైతులను కాంగ్రెస్ సర్కార్‌తో పాటు కొనుగోలు నిర్వాహకులు నిలువు దోపిడీ చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు కుర్వ పల్లయ్య ఆరోపించారు. నిర్వాహకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ సంతోష్‌కు రైతులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 69 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని వాటి ద్వారా కొనుగోలు నిర్వాహకులు భారీ అవకతవకలకు పాల్పడుతున్నారన్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై కఠినమైన చర్యలు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు సెంటర్ల నిర్వాహకులు తీసుకున్న ధాన్యాన్ని రికవరీ చేయాలని కలెక్టర్‌ను కోరారు. నిర్వాహకులు రైతుల వద్ద అదనంగా బస్తాకు 700గ్రాములు తీసుకుంటున్నారని ఇలా తీసుకోవడం వల్ల రైతులు క్వింటాళ్లకు 2కేజీలకు పైగా అదనంగా ధాన్యం కోల్పోవాల్సి వస్తుందన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులంతా అధికార పార్టీ నాయకులే అన్నారు. రైతులు ఎక్కువగా ధాన్యం తీసుకుంటున్నారని ప్రశ్నిస్తే కొనుగోలు సెంటర్ల నిర్వాహకులు వేధింపులకు గురిచేస్తున్నారని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే కలెక్టర్ విచారణ చేయించి అదనంగా తీసుకున్న వడ్లను రికవరీ చేసి వంత పాడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మధు, మగ్బూల్, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మన్న, తేజ, నాగరాజు, తిమ్మప్ప, నర్సింహులు పాల్గొన్నారు.

గోపాల్‌దిన్నెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజావాణికి 53 దరఖాస్తులు

ప్రజావాణికి 53 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలతో కూడిన 53దరఖాస్తులు బాధితులు అందజేసినట్లు చెప్పారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కృషి చేయాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, మే 5 : విద్యుత్ భారాన్ని తగ్గించుకొని ఆర్థిక లాభాన్ని పొందేందుకు గ్రామాల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో రెడ్కో, విద్యుత్ లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో జిల్లాలో సోలార్ విద్యుత్ ప్లాంట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ ప్లాంట్ల గురించి క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రెడ్కో ఎండీ మనోహర్ రెడ్డిని ఆదేశించారు. సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాలను అమలు చేస్తుందని, 5000 ఇండ్లు కంటే ఎక్కువ ఉన్న రెవెన్యూ గ్రామాల్లో మోడల్ సోలార్ విలేజెస్ పోటీలను నిర్వహిస్తుందని, ఏ గ్రామంలో అయితే ఎక్కువ గృహాలు సోలార్ ప్యానెల్ పెట్టుకొని విద్యుత్ ఆదా చేస్తాయో ఆ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా సౌర విద్యుత్ ఉపకరణాలను రూ.కోటిలకు అందిస్తాలని తెలిపారు. అదేవిధంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌కు 5 కిలోమీటర్ల పరిధిలో వ్యవసాయ పొలంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యుత్ శాఖకు అమ్ముకోవడం వల్ల యూనిట్‌కు రూ.3.13 సంపాదించుకోవచ్చని చెప్పారు. పీఎం సూర్య, పీఎం ఘర్ పథకంలో గృహ సౌర విద్యుత్ ప్యానల్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కొంత సబ్సిడీ ఇస్తుందని, కుసుమ్ పథకం కింద బ్యాంకు ద్వారా 75శాతం రుణాలు పొందే అవకాశం ఉంటుందని, ఇందులో 4శాతం బ్యాంక్ వడ్డీని కేంద్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. జిల్లాలో సౌర విద్యుత్ ప్యానల్ విస్తరణకు పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలతో సమన్వయం చేసుకొని గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ రాజశేఖర్, డీఎల్‌పీవో రఘునాథ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సాయితేజ ఉన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, యాదయ్యలతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 65 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ చెప్పారు.

'భూ భారతి' దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

గోపాల్‌పేట, మే 5 : భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను సాధ్యమైనంత వరకు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. రెవెన్యూ సదస్సు నిర్వహణకు పైలట్ మండలంగా గోపాల్‌పేటను ఎంపిక చేసిన నేపథ్యంలో సోమవారం మండలంలోని చెన్నూరు, జయన్నతిరుమలాపురంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కలెక్టర్ జయన్నతిరుమలాపురం గ్రామ సచివాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును పరిశీలించారు. వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. చెన్నూరులో మొత్తం 36 దరఖాస్తులు, జయన్నతిరుమలాపురంలో 25 వెరసి 61 దరఖాస్తులు స్వీకరించినట్లు తాసీల్దార్ పాండు వివరించారు. అందులో సక్సెషన్ 18, మిస్సింగ్ సర్వే 2, పెండింగ్ మ్యుటేషన్1, డిజిటల్ సైన్ 1, ఎక్సైట్ వెరిఫికేషన్ 2, నేమ్ కరెక్షన్ 5, పార్ట్ బీ 1, అసైన్డ్ పట్టా 3, ఇతర అంశాలు 28 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ సాధ్యమైనంత వరకు అక్కడక్కడే పరిష్కరించే ప్రయత్నం చేయాలని, సక్సెషన్‌కు సంబంధించి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని సూచించారు. కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలకు ఒక మీ సేవ సిబ్బందిని సిస్టమ్‌తో పాటు వెంట కూర్చోబెట్టుకొని త్వరగా అయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తాసీల్దార్ పాండు, డిప్యూటీ తాసీల్దార్ తిలక్ కుమార్ రెడ్డి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సుగుణమ్మ (ఫైల్)

గోపాల్‌పేట, మే 5 : వాకింగ్‌కు వెళ్లిన మహిళ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఘటన నర్సింగాయపల్లిలో చోటు చేసుకున్నది. ఎస్సై నరేశ్ కుమార్ కథనం మేరకు..మండలంలోని నర్సింగాయపల్లి గ్రామానికి చెందిన రాకాసి సుగుణమ్మ (65) సోమవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లింది. గ్రామం నుంచి వనపర్తి వెళ్లే ప్రధాన రహదారి పక్కల వాకింగ్ చేస్తుండగా, అచ్చంపేట కు చెందిన షేక్ ఖాజా గోపాల్‌పేట నుంచి వనపర్తి బైక్ పై వెళ్తూ..సుగుణమ్మను వెనక నుంచి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఆమె గాయపడింది. అదే సమయంలో వెనక నుంచి వచ్చిన మరో గుర్తు తెలియని బైక్ కూడా ఆమెను ఢీ కొనడంతో ఆమె అక్కడిక్కడే ప్రాణాలు వదిలారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. మృతురాలు భర్త ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలుకు భర్త, కూతురు ఉంది. ఈ ఘటనలో మృతురాలితో పాటు వాకింగ్ చేస్తున్న అనసూయమ్మ కూడా తీవ్రంగా గాయపడింది.

పొలానికి వెళ్లిన బాలుడు .. ఇంటికి శవమై వచ్చాడు

భరత్‌కుమార్(ఫైల్)

రేవల్లి, మే 5 : ఓ బాలుడు తండ్రితో పొలానికి వెళ్లి ఇంటికి శవమై వచ్చిన ఘటన మండలంలోని కేశంపేట గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. రేవల్లి ఎస్సై రజిత కథనం ప్రకారం గ్రామానికి చెందిన కుర్వ లక్ష్మి, శంకరయ్యలకు ఆరు గుర్రు సంతానం. వీరిలో భరత్(12) మూడో కుమారుడు. ఆదివారం తండ్రి శంకరయ్య కుమారులు రాజు, భరత్‌కుమార్ కలిసి పాత తండా రోడ్డులో ఉన్న వారి పొలం వద్దకు వెళ్లారు. చీకటి కావడంతో తండ్రి శంకరయ్య భరత్ కుమార్‌కు నేను వస్తాను, నువ్వు వెళ్లు అని చెప్పడంతో భరత్‌కుమార్, రాజు డ్రైవర్ రాముడు ట్రాక్టర్ ఇంజన్‌పై బయలుదేరారు. మార్గమధ్యన ఎదురుగా మరొక వాహనం రావడంతో సడెన్‌గా ట్రాక్టర్ బ్రేక్ వేయడంతో ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చున్న భరత్‌కుమార్ జారిపడి ఇంజిన్ వెనుక టైర్ కిందపడి మృతిచెందాడు. ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్ రాముడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.రు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు

అలంపూర్ చౌరస్తా, మే 5 : ఉండవెల్లి మండల శివారులో రోడ్డు ప్రమాదంలో ఒక రైతుకు గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకున్నది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం ఇటిక్యాల మండలం యాపదిన్నె గ్రామానికి చెందిన శేఖర్ అనే రైతు ట్రాక్టర్‌లో మొక్కజొన్నలు వేసుకుని కర్నూల్ మార్కెట్‌కు తరలిస్తుండగా ఉండవెల్లి శివారులో భారత్ పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారిపై ట్రాక్టరులో నుంచి మొక్కజొన్న సంచులు కింద పడ్డాయి. దీంతో శేఖర్ మొక్కజొన్న సంచులను తీస్తుండగా వెనుక నుంచి కారు వేగంగా వచ్చి శేఖర్‌ను ఢీకొట్టడంతో తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కర్నూల్ దవాఖానకు తరలించామని కారు డ్రైవర్‌పై కెసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత మృతి

మల్దకల్, మే 5 : కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం మండలంలోని మద్దెలబండ గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం నెల్లూరు జిల్లా కనిగిరి మండలం వీరనకర్ గ్రామానికి చెందిన అనిత(22), భర్త హరికృష్ణ యాదవ్ మూడు నెలల కిందట బతుకు దెరువు కోసం గ్రామానికి వచ్చారు. వీరు గ్రామంలో జ్యూస్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. వీరికి నాలుగేండ్ల కిందట పెండ్లి కాగా పిల్లలు ఇంకా పుట్టలేదన్నారు. అయితే ఆదివారం రాత్రి భార్యాభర్తలు గొడవపడి అద్దెకు ఉన్న ఇంట్లోనే అనిత ఉరేసుకొని మృతి చెందిందన్నారు.. మృతదేహాన్ని పోలీసులు గద్వాల ప్రభుత్వ దవాఖాన కు తరలించారు. అయితే ఈ విషయంపై సీఐ టంగుటూరి శ్రీనును వివరణ కోరగా మృతిచెందిన మహిళ తరపున ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

మట్టి టిప్పర్ పట్టివేత

అలంపూర్ చౌరస్తా, మే 5 : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని రవాణ చేస్తున్న టిప్పర్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్న ఘటన చోటుచేసుకున్నది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం కర్నూల్ జిల్లాకు చెందిన జింకల ప్రసాద్ అనే వ్యక్తి మానవపాడు మండలం పోతులపాడు శివారులో టిప్పర్‌లో అక్రమంగా మట్టిని వేసుకుని అలంపూర్ చౌరస్తాకు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు టిప్పర్ నిలిపి అనుమతులు అడగగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో టిప్పర్‌ను ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెట్టును ఢీ కొట్టిన వాహనం

గద్వాల అర్బన్, మే 5 : ప్రమాదవశాత్తు వాహనం చెట్టుకు ఢీకొట్టిన ఘటన ధరూర్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..ధరూర్ మండలంలోని అల్లపాడు సమీపంలో ఉన్న తాయమ్మ మెట్టు వద్ద ఓ టాటా ఏసీ వాహనం ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. వాహనంలో 20మంది ఉండగా ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయలు కాకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. వాహనం పాక్షికంగా ధ్వంసం అయినట్లు స్థానికులు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

అమరచింత /గద్వాల అర్బన్, మే 5 : మనస్తాపంతో ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన అజ్జకోలు సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే కానిస్టేబుల్ అశోక్ కథనం మేరకు.. అత్మకూర్‌కి చెందిన మహేశ్ (22) తన కుటుంబానికి , బంధువుల కుటుంబానికి మధ్య జరిగిన గొడవ కారణంగా తనతో పాటు కుటంబ సభ్యులపై ఆత్మకూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో ఆవేదన గురై తనకు ఇక ప్రభుత్వ ఉద్యోగ అవకాశలు రావని మనస్తాపం చెంది సోమ వారం వనపర్తి రోడ్డు రైల్వే స్టేషన్ మధ్యన అజ్జకొలు సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో రైల్వే కానిస్టేబుల్ మృతిదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లబ్ధిదారుల ఎంపికలో పేదలకు ప్రాధాన్యత కల్పించాలి

అదనపు కలెక్టర్ నర్సింగరావుకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు.

గద్వాల రూరల్, మే 5 : ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో పేదలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం అదనపు కలెక్టర్ నర్సింగరావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, ఇండ్లు లేనివారికి కాకుండా ఇండ్లు ఉన్నవారికి లిస్టులో పేర్లు ఉంటున్నాయన్నారు. గ్రామాల్లో గుడిసెలు ఉన్నవారు తమ పేరు లిస్టులో రాలేదని గగ్గోలు పెడుతున్నారని అన్నారు. వారిగురించి పట్టించుకోక